ప్రమాదీచ 1973 ఉగాది కథల పోటీలో రెండవ బహుమతి పొందిన కథ

# నింగీ — నేలా

**పోలాప్రగడ రాజ్యలక్ష్మి**

అసిరిగాడిది పూర్తిగా నేలంటు బ్రతుకు. సంఘంలో కొంచెం ఎత్తుగా తలెత్తుకోడానికి. వాడికి వృత్తీ. కులమూ. హోదా డబ్బూ వీటి ఆసరా ఏమిలేదు. నీళ్ళూ రాళ్ళూ బుగ్గి బూడిదా మన్నూ మశానంతో కూడిన గొగ్గిగొగ్గుల నేలలాగే వాడి బ్రతుకుకూడా అర్థాకలీ, అవమానం. కన్నీళ్ళూ కలతనిద్రా — వీటితో అడుగడుగునా గతుకులు గతుకులుగా నికృష్టంగా నడుస్తోంది.

ఊళ్ళో ఎవరు చచ్చిపోయినా అసిరిగాడు వెళ్ళి బాజా వాయించాల్సిందే। వాడి "చావు బజా" లేకుండా ఊళ్ళో యే శవమూ శ్మశానంవేపు కదల్దు. అలా ఊళ్ళోవాళ్ళ చావులమీద వాడు బతుకుతూండడంవల్లే వాడంటే ప్రతివాడికీ అసహ్యం. చీదరింపూను. వాడిలాగే ఊళ్ళో వాళ్ళ బాధల పునాదులమీదా, అనారోగ్యాల ఆసరామీదా. తమ బతుకుల్ని నడుపుకుంటున్నవాళ్ళు కొందరు ఉన్నారు.

వాళ్ళల్లో ఒకళ్లు రాజయ్యా. మరొకళ్ళు డాక్టర్ సుదర్శనమూను. అవతలివాడి అవసరాన్నిబట్టి బారువడ్డీలకీ, చక్రవడ్డీలకీ తనఖాలమీద అప్పులిచ్చి, అంకినంతమటుకి అందరి ఆస్తులూ రాజయ్య పడేసుకుంటూంటే, చిన్న రోగాలకి పెద్ద చికిత్సలు చేసీ. అరకుతో పోయేదానికి ఆపరేషన్లు దాకా చేసి వేలకివేలు వెనకేసుకుంటాడు సుదర్శనం. ఇద్దరికీ ప్రజల కష్టాలు కానీ. కన్నీళ్ళు కానీ ఏం పట్టవు. వాళ్ళ కంగారూ భయం ఎంతసేపటికీ ప్రజలెక్కడ హాయిగా. సుఖంగా ఉంటారో అనే— వాళ్ళు బతికేది కూడా లోకం ఏడుపు మీదే। అయినా వాళ్ళిద్దరినీ ఎవరూ అసహ్యించుకోరు చీదరించుకోరు. పైగా సమయానికి ఆదుకున్నాడని రాజయ్యనీ. మృత్యుముఖం నుంచి కాపాడేడని సుదర్శనాన్నీ వేనోళ్ళ పొగుడుతారు.

దానికి కారణం వాళ్ళది అసిరిగాడిదిలా నేలంటు బ్రతుకు కాకపోవడమే।

కళ్ళని జిగేల్ మనిపించే వెలుగుల్ని విరజిమ్ముతూ. క్షణ క్షణానికీ రంగు రంగుల మబ్బు దుస్తుల్ని మారుస్తూ ఎత్తుగా గర్వంగా బోర విరుచుకుని దర్జాగా వంగి ఇంద్రనీలాల కాంతితో ధగధగా మెరిసిపోయే నింగిలాంటి జీవితం వాళ్ళది. కాని అసిరిగాడి జీవితం అలా కాదుగా? అపశకునానికీ, అశుభానికీ సంకేతంలా సిరపడిపోయిన అసిరిగాడి మొహం పొద్దున్నే చూడడానికి ఎవరూ ఇష్టపడరు. పెళ్ళిళ్ళూ. ఉత్సవాలూ వంటి శుభసమయాల్లో సరేసరి. వాడాపరిసరాల్లో కనిపించడానికే వీలు లేదు.

ఇలా అడుగడుక్కీ అవమానాలూ. ఈసడింపులూ. చివాట్లూ భరిస్తూకూడా వాడు దిగులుపడకుండా ఆ ఊళ్ళోనే ఉండిపోయాడంటే అందుకు రెండే రెండు కారణాలున్నాయి.

వాటిలో ఒకటి. వాడి ఏకాంత జీవితంలోకి ఎక్కడినుంచో వచ్చి ప్రవేశించిన బాబిగాడి అమాయకమైన పసితనపు బోసినవ్వు.

రెండోది. డాక్టర్ సుదర్శనంగారి పద్దెనిమిదేళ్ళ రజని చక్రాల్లాంటి కళ్ళల్లో విరిసే తడిసిన పారిజాతంలాంటి చల్లని జాలి చూపూ.

ఈ రెండేకనక లేకపోతే. అడుగడుగునా ఎదురయ్యే అవమానాలకీ. అందరి దగ్గర్నుంచీ అకారణంగా లభించే చివాట్లకీ విసుగెత్తి. ఆ ఊరు ఎప్పుడో విడిచిపోయి ఉండేవాడు.

అసలా ఊళ్ళో ఏం ఉందని। ఓ జాలా. దయా. ఆదరణా?

ఎంతసేపటికీ వాడిని వీడు మోసం చెయ్యా. వీడికి వాడు గోతులు తవ్వా. వాడినెత్తిగొట్టి వీడూ వీడిని క్షోభపెట్టివాడూ ఎలా సుఖపడదామా అన్న ధ్యాసే ప్రతీవాడికీ. కక్షలతోనూ కార్పణ్యాలతోనూ ప్రతి నిముషం బుసలు కొడుతూ ఒకణ్ని ఒకడు కాటెయ్యడానికి సమయం కోసం పగబట్టిన పాముల్లా కాసుక్కూచుంటారు ఆ ఊళ్లో ఉన్న జనం అంతా. అలాంటి జనాన్ని ఒకడిమీదికి ఒకణ్ని ఉసిగొలిపి వాళ్ళ కొట్లాటలకి కావలసిన డబ్బుని అప్పుగాయిస్తూ అంకినంత మట్టుకి, అందరి ఆస్థులూ పడేసుకుని మూడతంస్థుల మేడ ఒకటి ఊరికి అటు రాజయ్య కడితే. న్యాయం. ధర్మం ఉచిత వైద్యం అంటూనే రెండు చేతులా సంపాదించి. బ్రహ్మాండమైన ఆసుపత్రి ఒకటి ఊరికి ఇటుకట్టాడు సుదర్శనం. ఇటూ అటూ ఉన్న ఆ రెండు భవనాలతో. రెండు తలల నాగులా కనిపిస్తూ. ఉండుండి కడివెడు కడివెడు విషం అయితే కక్కుతూ ఉంటుంది. ఆ ఊరు.

ఆదరణా ఆప్యాయతా ఎండిపోయి, బొగులు బొగులు మంటూన్న ఆ ఊళ్ళో, జాలీ దయా అసిరిగాడికి కనిపించింది రజని కళ్ళల్లోనే।

మొదటిసారి తను రజనిని చూసింది ఆమెకి పన్నెండేళ్ళు ఉన్నప్పుడు.

ఆ రోజున ఆ వీధి వెంట చావు బాజా వాయిస్తూ వెళుతూవుంటే, సుదర్శనంగారి రెండో అంతసు కిటికీలోంచి, నీళ్ళునిండిన కళ్ళతో, ముఖంనిండా జాలీ దయా నింపుకుని, కనిపించింది రజని

ఆ సమయంలో అసిరిగాడికి ఆమె నింగిలో విరిసిన హరివిల్లులా తోచింది. వేలంటు బ్రతుకుల తల నిమిరి ఊరట కలిగించడం కోసం ఆకాశం జాలిగా వంగినటూ; నేల. వెర్రి ఆవేశంతో చేతులు జాపుకుని దిక్కుల చివళ్ళకంటా పరిగెడుతున్నట్టూ, అక్కడ ఎక్కడో అవి రెండూ కలుసుకుంటున్నట్టూ అనిపించింది అసిరిగాడికి. అంతే— పట్టలేని ఆనందంలో తన్మయత్వం చెంది మరింత జాలిగా చావు బాజా వాయించాడు అసిరిగాడు. రజని చల్లని చూపులు వచ్చి మనస్సునీ, శరీరాన్నీ సేదదీరుస్తూంటే. ఇంకా ఎంతసేపు ఆ తన్మయస్థితిలో ఉండిపోయేవాడో, ఇంతలో వాళ్ళ నాన్న కిటికీ దగ్గరికి వచ్చి "అమ్మా తప్పు. శవాలు వెళ్ళడం చూడకూడదు" అన్నాడు. అంతే ఇంద్రధనుస్సు కరిగిపోయింది.


సుదర్శనంగారి వేడిచూపులు మాత్రం వచ్చి అసిరిగాడికి చురుక్కుమంటూ తగిలాయి.

ఆ తర్వాత నెలకీ ఏ రెండు మూడు పర్యాయాలైనా, ఎత్తైన అంతసులోంచి వచ్చే రజని జాలి చూపులు, అటడుగు స్థానంలో ఉన్న అసిరిగాడి మనస్సుకి మంచి గంధపు పూత పూసి, దైన్యాన్నీ, బాధనీ పోగొట్టి సేదతీర్చేవి. వాటిని ఎన్నిరోజుల దాకానో గుండెలో పదిలంగా దాచుకుని, తీరిగ్గా కూచున్నప్పుడల్లా జ్ఞాపకం తెచ్చుకుని, మురిసిపోయేవాడు అసిరిగాడు.

తనా దారిన బాజా వాయిస్తూ వెళితే, ఎప్పుడేనా రజని మొహం కనక కిటికీ దగ్గర కనిపించకపోతే వాడ ప్రాణం విల విల్లాడిపోయేది. కళ్ళు ఆయింటి గుమ్మాల్నీ, కిటికీల్నీ వదిలి వచ్చేవి కావు. అలాంటప్పుడు బాజామీది వేళ్ళు తడబడేవి కూడా. మళ్ళీ రజని చూసేదాకా మనస్సంతా ఏదో దిగులుగానూ, నిరుత్సాహంగానూ ఏ పని చెయ్యడానికీ ఇష్టం లేకుండానూ ఉండేది.

ఇలా అసిరిగాడు ఏ అయిదారేళ్ళు రజని చల్లని చూపుల నీడలో సేదదేరాడో ఏమో!

"రజని పెళ్ళిట!" అని యెవరో అంటూండగా విన్నప్పుడు అసిరిగాడు ఒక్క క్షణం చలనం లేకుండా వుండిపోయాడు. ఆ రోజు వాడు మతిలేకుండా ఊళ్ళో అన్ని వీధులూ తిరిగాడు. వండుకున్న అన్నం తినలేదు. పాకముందు రోజులాగే కళ్ళాపు జల్లి ముగ్గేటి ముంతల్లో నీళ్ళు నింపుదాం అని లోపలికెళ్ళిన పక్కింటి పైడితల్లికి. పాక నిట్టాడుకి దిగాలుగా జేర్లాపడికూచుని కనిపించాడు. ఆసిరిగాడు పైడితల్లి ఏదో



## నింగి–నేలా

పరాచకం ఆడబోతే గట్టిగా విసుక్కుని పీధులట్టిపోయాడు.

"ఏవిట్రా ఆ దడి తాటాకులు ఒత్తిగించి అలా చూస్తున్నావు. అయినా అపశకునం మొహానివి పెళ్ళింటి దగ్గర నీకేం పని? డాక్టరుగారి కంటపడ్డావో నిన్ను చంపేస్తారు.....ఫో.....ఊ..... పొమ్మంటూంటే" అంటూ షావుకారు రాజయ్య కుక్కని తరిమినట్లు తరిమాడు.

"పెళ్ళి ముస్తాబులో రజని ఎల్లాఉందో" చివరికి చూడ్డమే పడలేదు అసిరిగాడికి. రజని అత్తారింటికెళ్ళిపోయింది. "ఏంటి నువ్వీమద్దె ఎక్కడబడితే అక్కడ దిగాలుగా కూసుని ఉండిపోతన్నావు?" అని ఎన్నిసుట్లో పక్కపాకలో పోతరాజు అడిగాడు అసిరిగాడిని.

"అన్నం కూడా సరిగా తింటంలేదట! మన పైడితల్లి సెప్పింది" అంది పోతరాజు పెళ్ళాం రంగి.

పైడితల్లి పాక ఎనకాల కెళ్ళి పరికిణితో కళ్ళు ఒత్తుకుంది.

నిజమే_ అసిరిగాడు మరీ దిగాలుగా, తప్పదన్నట్లు రోజులు గడుపుతున్నాడు.

తప్పనిసరి అయి చావు బాజా వాయించవలసివచ్చి. డాక్టర్ సుదర్శనం ఇంటి ముందునించి వెళితేమాత్రం అసిరిగాడి కళ్ళన్నీ ఏదో పోగొట్టుకున్నట్టు. రజని లేని ఆ గుమ్మాల్ని కిటికీల్ని వెతికేవి. బాజామీద వేళ్ళు సరిగ్గా పడేవి కావు. మనస్సంతా చిరాగ్గా, తిక్కగా ఉండేది. వాడి వాలకం చూసి అంతా "లాభం లేదు. వీడికి త్వరలో పిచ్చెక్కుతుంది" అనుకున్నారు. కాని దేవుడు అంతవరకూ రానియ్యలేదు. "రజనిని మరిచిపోరా" అని వాడికి బాబిగాడి నిచ్చాడు.

ఓ రోజు అసిరిగాడు తెలతెల వారకుండా శ్మశానం పక్కనుంచి వస్తూంటే చంటిపిల్లాడి ఏడుపు వినిపించింది. దాపిదాని భవిష్యత్తుమీద జాలివహించి రాజయ్య ఏర్పాటుచేసిన మనుష్యులు అప్పటికే, ఆ చంటాడిపీక నులిమెయ్యబోతూ, అసిరిగాడి అడుగుల చప్పుడు విని పారిపోయారు.

దిక్కులేకుండా శ్మశానంలో పడి ఏడుస్తూన్న ఆ పసికందుని ఎత్తుకుని తన గుడిసెకి తిసుకు రాకుండా ఉండలేకపోయాడు.అసిరిగాడు.అంతే అప్పటినుంచీ బాబిగాడు బోసినవ్వులునవ్వుతూ అసిరిగాడి ఏకాంత జీవితంలో వెలుగులు పండించసాగాడు. అసిరిగాడిలో తిరిగి పూర్వపు ఉత్సాహం, చైతన్యం కనిపించసాగాయి.

పక్కింటి పైడితల్లి ముఖం విప్పారింది.

ఎప్పుడేనా రజని జ్ఞాపకం వచ్చినప్పుడు మాత్రం చూరునుంచి కారుతూన్న నీళ్ళ చుక్కల్ని చూస్తూనో, గుడిసె నడికొప్పు కంతల్లోంచికనిపించేఆకాశాన్ని చూస్తూనో పరధ్యాన్నంగా గంటలకి గంటలు ఆమట్టునే ఉండిపోయేవాడు అసిరిగాడు. అలాంటి సమయంలో పలకరించటానికి భయం వేసేది పైడితల్లికి.జ్ఞాపకాల లోకం నుంచి ఈ లోకానికి అసిరిగాడిని తీసుకుని రాగలిగింది, మళ్ళీ బాబిగాడి చిరునవ్వు ఒక్కటే!

ఆ చిరునవ్వే కరువైపోయింది వారం రోజుల్నుంచి.

వడ్లగింజ వేస్తే పేలాపగింజ అయేలాగ కాస్తోంది జ్వరం. బుగ్గలు ఎండిపోయి, చిక్కి శల్యంలా అయిపోయి మంచానికి అల్లంటుకుపోయి మగతగా పడుకున్నాడు బాబిగాడు. అస్తమానూ ఆడుతూ గెంతుతూ వచ్చీరాని మాటలతో తన చుట్టూ తిరుగుతూ వెర్రినాగన్నలా కాలక్షేపం చేసుకొనేవాడు. వాడిని చూసినకొద్దీ పెద్ద కెరటంలా ఆపుకోలేనంత ఏడుపు వచ్చేస్తోంది అసిరిగాడికి. పొద్దుట ఆచారిగారు "నా శాయశక్తులా చూశానురా అబ్బాయ్! లాభం లేదు. ఆ సుదర్శనం చేత సూదిమందు వేయించి చూడు. అదృష్టం ఉంటే...." అంటూ ఆపె మాటలు మందుల సంచితోసహా మూటకట్టేస్తూ



"ఉగాది ప్రసాదం" చిత్రం : వెల్లటూరిపూర్ణానందశర్మ, వెల్లటూరు.

లేచిన దృశ్యం జ్ఞాపకం వచ్చేసరికి కుప్ప కూలినట్లు కూలిపోయాడు అసిరిగాడు.

గుడిసెచుట్టూ చీకట్లు ముసురుకుంటు న్నాయి.

గుడిసె లోపల. గాలికిరెపరెపలాడుతూ మినుకుమినుకు మంటూన్న దీపంలా బాబి గాడు.

"నాన్నా-బాబీ" అన్నాడు మంచంమీద ఒంగి బొంగురుబోయిన కంఠంతో అసిరి గాడు. జవాబు లేదు. మగతగా పడుకొని ఉన్నాడు. "కళ్ళు తెరవరా నాన్నా. నీకు చెమ్కీటోపీ చెప్పులూ తెచ్చాను చూశావా? నీ మీద ఎన్ని ఆశలు పెట్టుకున్నానురా" అంటూ బావురుమని ఏడ్చేశాడు అసిరిగాడు.

నెమ్మదిగా తీసుకుంటూన్న శ్వాసవల్ల కుర్రాడి పక్క ఎముకలు కొద్దిగా లేస్తు న్నాయి. కళ్ళు తుడుచుకుని ఒక్కక్షణం బాబిగాడికేసి చూశాడు. కీడు జరుగుతుం దేమో అనే భయం గడ్డకట్టించే చలిలా గుండెలకి తగిలింది. నిలువెల్లా వణికి పోయాడు. నోటికి గుప్పెళ్ళు అడ్డుపెట్టు కుని ఏడుస్తూ సుదర్శనం ఆసుపత్రికేసి పరిగెట్టాడు.......

అసిరిగాడి ఏడుపుకి చీదరించుకున్నాడు డాక్టర్ సుదర్శనం. "చెప్తుంటే నీకు కాదూ? ఆ చీటీలో రాసిన మందులు తెచ్చుకుంటే మా కాంపౌండర్ వచ్చి ఇంజెక్షన్ ఇస్తాడు. అయినా లక్ష ణాలు చెప్పావుకదా నేను రావడం దేనికి నీ గుడిసెకి?" అంటూ విసురుగా లోపలికి వెళ్ళిపోయిన సుదర్శనం దిక్కుగా చూస్తూ వెర్రిగా అమట్టునే ఉండి పోయాడు అసిరిగాడు.

"డాక్టరుగారి అమ్మాయి పురిటికి వచ్చింది. ఇప్పుడు ప్రసవించే సమయం. ఆయన అందువల్ల ఆదుర్దాగా ఉన్నారు. అంతే_రేపు రా" అంది నర్సు.

"ఆ! రజని వచ్చిందా!"

ఆ మాట పైకే అన్నాడో లోపలే అను కున్నాడో తెలియదు.

రజని కనిపిస్తుందేమో అనే ఆశతో పిచ్చివాడిలా ఆ గుమ్మందగ్గర ఎంతసేపు న్నాడో కూడా తెలియదు.

కొరడాతో కొట్టినట్లు బాబిగాడి సంగతి జ్ఞాపకం వచ్చి ఒక్కపరుగున మందుల షాపుకి వెళ్ళాడు అసిరిగాడు. పదిరూపాయ లిచ్చి మరీ మందులు పట్టికెళ్ళమన్నాడు షాపువాడు.

పది రూపాయలు!

తన దగ్గర చిల్లిగవ్వలేదే!

ఎవరిస్తారు అప్పు? ఏం చూసి ఇస్తారు?

అప్పు అనగానే అసిరిగాడికి రాజయ్యే జ్ఞాపకం వచ్చాడు.

FREE !! | వజ్రాల హారాలు | ఉచితం !!

# ఉగాది లెక్కలు

సంవత్సరారంభంలో ప్రతి తెలివైన వ్యాపారి తన విల్వల లెక్కలను చూచుకొం టాడు. లాభ నష్టాలు తేల్చుకొంటాడు. ఆ ఏడు మంచి లాభాలు గడిస్తే సంతోషిస్తాడు. నష్ట మొస్తే. తన కష్టానికి తగ్గ ఫలితం రాలేదని విచారిస్తాడు.

వ్యాపారములో నష్టానికి అనేక కారణాలు వుంటాయి. అజాగ్రత్తగా ఖర్చుపెట్టిన చిన్న మొత్తాలు ఎక్కువ కావచ్చు. సరకులను సరిగా ఆర్డరు చేయకపోవడం, అమ్మకాల విషయం అశ్రద్ధ చేయడం మొదలైనవి నష్టానికి కారణాలు. అనేకసార్లు చిన్న విషయాల్ని నిర్లక్షం చేయడంవల్లనే నష్టం సంభవిస్తుంది.

లెక్కలు చూచుకోడం వ్యాపారంలోనేగాక జీవితంలో కూడ జరగాలి. దేవుడు ప్రతి వ్యక్తికి ఏదో ఒక పనినిచ్చాడు. ఆ కార్య నిర్వహణకు కావలసిన జ్ఞానాన్ని. నైపుణ్యాన్ని కూడా అనుగ్రహించాడు. మన ఉద్యోగ ధర్మాన్ని సరిగా నిర్వహిస్తే మనకు సంతోషం కలుగుతుంది. కాని మన పని విషయం నిర్లక్ష్యంచేస్తే లెక్కలు చూచుకొనే సమయంలో చిక్కులు వస్తాయి. జీవితంలో చిన్న చిన్న విషయాలనుగూర్చి మనం జాగ్రతగా వుండాలి. పొరుగువారి విషయం మర్యాదగా ప్రవర్తించడం చిరునవ్వుతో మిత్రునికి ప్రోత్సాహమివ్వ డం. అవసరతలోనున్నవారి అవసరాలు తీర్చడం. కష్టాల్లోను. దుఃఖాల్లోను వున్నవారిని ఓదార్చడం మొదలైన చిన్న విషయాలే మనలను మంచి సేవకులనుగా చేస్తాయి.

మన దేశానికి పొరుగువారికి చేయవలసిన ధర్మాలను మనం చేయాలని దేవుడు ఆశిస్తాడు. మనం చేసుకోవలసిన పనులుకూడ శ్రద్ధతో చేసుకోవాలి. దేవుని పథకాలు ఎప్పుడూ మన విశ్వాసంపైనే ఆధారపడి వుంటాయి. మనం లేకుండా ఆయన తన కార్యాలు నిర్వహించగలడు. కాని ఆయన మనద్వారా తన కార్యాల్ని నిర్వహించాలని ఆశిస్తాడు.

యేసుప్రభువు ఒకసారి ఈ కథ చెప్పాడు. ఒక ధనికుడు దూరదేశానికి ప్రయాణం చేస్తూ. ముందుగా తన సేవకులను పిలిచి ఒక్కొక్కరికి కొంత ధనాన్నిచ్చి ఆ ధనాన్ని విజ్ఞ తతో చూడమని వాళ్ళకు చెప్పాడు. ఆయన తన ప్రయాణాలు ముగించుకొని తిరిగివచ్చిన తరువాత వారిని పిలిచి ఆ డబ్బు. ఏ విధంగా వుపయోగించారని అడిగాడు. మొదటివాడు "అయ్యా! నీ డబ్బు పదింతలు సంపాదించింది." అని చెప్పాడు. అందుకతడు వానిని మెచ్చు కుని పది పట్టణాలకు అధిపతిగా నియమించాడు. మరియొకడు తన డబ్బు ఐదింతలు లాభం చేకూర్చిందన్నాడు. అందుకా యజమాని వానిని మెచ్చుకొని ఐదు పట్టణాలకు వానిని అధి పతిగా నియమించాడు. మరి యొకడు తన యజమానివద్దకువెళ్ళి "అయ్యా! కఠినమైనవాడి వని భయపడి నీ విచ్చిన డబ్బును దాచి వుంచాను. ఇదిగో నీ విచ్చిన రూపాయలు." అని ఇచ్చాడు. అందుకాయన "వీడు నిష్ప్రయోజకుడు వీని దగ్గరనుండి ఆ డబ్బును తీసుకొని లాభం గడించిన వానికివ్వండి" అన్నాడు.

ఆ వ్యక్తి ఎవరోకాదు యేసుప్రభువే. ఆ సేవకులు ఆయన అధికారాన్ని గుర్తించి దానికి లోబడే మనమే. నైపుణ్యం. జ్ఞానం శీలం. ఆరోగ్యం. అవకాశాలు మొదలైన దేవుని ఈవులే ఆ ధనం. మనం వాటిని వుపయోగించిన విధానాన్నిబట్టే ప్రతిఫలం పొందుతాము.

ఈ ఉగాదికి దేవుడు మన కనుగ్రహించిన ఆశీస్సులను పునః పరిశీలన చేసుకొని ఆయనకు విశ్వాసపాత్రులై లోక కళ్యాణానికి. దేవుని మహిమార్థమై వాటిని వాడుదామని ప్రతిన బూనుదాం.

నూతన సంవత్సరమంతా ఈ అనుభవంతో జీవించగోరుచున్నారా? అయితే ఈ దినమే మాకు వ్రాయండి.

చదలవాడ చంద్రమతీదేవి

ఉచితం ఉచితం ఉచితం

మీ ఇంట్లో కూర్చుని బైబిల్ పరిశోధన మీద చక్కటి సర్టిఫికెటు పొందాలన్నా. బైబిల్‌కి సంబం ధించిన అందమైన పుస్తకాలు కావా లన్నా ఒక కార్డుమీద మీ అడ్రస్ స్పష్టంగా వ్రాయండి. పోస్టు ఖర్చులు కూడా మావే.

HOPE

ఇదీ అడ్రస్ :

## ఎస్. జాన్ డేవిడ్

నిరీక్షణ, పోస్టు బాక్సు. 12.

చిలకలూరిపేట, గుంటూరు జిల్లా.

A.M.G

Gospel Message Inserted by

*Mr. S. John David, "NIREEKSHANA" Chilakaluripet, Guntur Dt. A. P.*

## నింగి—నేలా

మాటకీ మాటకీ మధ్యన ఒగుర్చు కుంటూ తనగోడు వెళ్ళబోసుకుంటూన్న అసిరిగాడిని చూసి జాలిపడి గుమాస్తా 'ఒరేయ్ నువ్వీ సమయంలో రాజయ్యగారికి కనిపించావంటే చంపేస్తారు. అసలే వాళ్ళ నాన్నగారు ఇప్పుడో ఇంకో క్షణానికో అన్నట్లు గుటుకూ గుటుకూ మంటూ ఉన్నారు. పిల్లాడిమందుకోసం అన్నావు కనక నా దగ్గర ఉన్నబాపతే ఏదో ఇస్తాను. తాకట్టుకి ఏం పట్టుకొచ్చావు?" అన్నాడు.

తా....క....ట్టు!

తన దగ్గర తాకట్టుకి తాహతైన వస్తువేం ఉంది? అంచు విరిగిన కుండా, అల్యూమినియం గ్లాసూ, అన్నం దాకా, కుక్కిమంచం. ఇవేగా?

ఏం లేవన్నాడు. సాయం చెయ్యమన్నాడు. కాళ్ళట్టుకుంటానన్నాడు.

ఏం లాభంలేదని గుమాస్తా పెదివి విరిచాడు

"నా దగ్గర ఆ చావు బాజాతప్ప ఇంకేం లేదండి" ఏడుస్తూ అన్నాడు. అసిరిగాడు.

గుమాస్తా అదిరిపడ్డాడు. 'ఏవి(ట్రా చావు బాజా తాకట్టు పెడతావా? నువ్వు బాకీ తీర్చకపోతే దాన్ని నేనేం చేసుకోను? నీ బదులు నేను వాయించనా? ఫో....ఫో.... చావుబాజా తాకట్టు పెడ్తాట్ట, చావుబాజా" అంటూ తరిమేశాడు గుమాస్తా. అసిరిగాడు ఏడుస్తూ ఎంతగా కాళ్ళావేళ్ళాపడి బతిమాలినా. వినిపించుకోకుండా–

గుడిసెలోకి వెళ్ళడానికి కొండంత భయం.

గుండెలు దడదడా కొట్టుకుంటున్నాయి.

బాబిగాడు ఎలా ఉన్నాడో!

జడుస్తూ జడుస్తూ లోపలికి వెళ్ళాడు–

హమ్మయ్య దేవుడు తనకి అన్యాయం చెయ్యలేదు.

ఇప్పుడేనా పది రూపాయలుంటే బాబిగాడు బతుకుతాడు. కాని ఎలావస్తాయి? తనకి ఎలా వస్తాయి పది రూపాయలు? ఎలాగ! పది రూపాయలు! ప.... దీ....

మూలనున్న చావు బాజామీద. గోడ బెత్తు పడి దిబ్బు మని చప్పుడైంది.

అసిరిగాడి వెన్నుపూసలో ఝల్లుమంది. బాబిగాడు చావు బతుకుల్లో ఉన్న ఈ సమయంలో ఈ చప్పుడేమిటి

భయంతో బాధగా అటు చూశాడు.

అవును ఇదే తననిప్పుడు ఆదుకోవాలి.

నిజమే!

ఊళ్ళో ఇప్పుడెవరేనా చచ్చిపోతే?

ఏ రాజయ్య తండ్రో!

పది రూపాయలకి తక్కువైతే బాజా వాయించనని మొండికేస్తాను.

ఆ! ....అంతే!....పది రూపాయలు వస్తాయి. బాబిగాడు బతుకుతాడు.

వాడు బతకాలంటే ఊళ్ళో ఎవరేనా చావాలి....

కట్టలు తెంచుకుని గుండెల్లోంచి దుఃఖం పొర్లిపోతోంది అసిరిగాడికి.

"ఏం చెయ్యను? నాది వెధవ జన్మ. నేను అపశకునాలు పలికేవాడిని – అశుభాన్ని కోరుకొనేవాడిని– నా బాబిగాడి కోసం ఇంకొకళ్ళు చావాలని కోరుకోడం పాపమే–సిచమే–కాని ఏం చెయ్యను?" అని బావురుమంటూ గోడకి జేర్లాపడిపోయాడు అసిరిగాడు.



"త ల పు లు"

చిత్రం : ఈశ్వర్, కాకినాడ–3

"అసిరీ!.... ఓ అసిరిగా!" అని పిల్చి పిల్చి సమాధానం లేకపోయేసరికి ఒంగుని పాకలోకి దూరివచ్చాడు సుదర్శనం కాంపౌండరు. అతణ్ణి చూస్తూనే (తుళ్ళిపడ్డాడు అసిరిగాడు.

"(ప్రసవించలేక రజనమ్మగారు చనిపోయిందిరా– నువ్వు వచ్చి చావు బాజా వాయించాలి!"

పిడుగులాంటి వార్త వినేసరికి నవనాడులూ బిగిసిపోయి జీవం లేనట్లు కాంపౌండరుకేసి చూశాడు అసిరిగాడు.

నింగికి ఎగసిపోయిన రజని

నేలమీద మిగిలిపోయిన తను

చావు బతుకుల్లో బాబిగాడు

అంతస్థుమీద అంతస్థు పెంచుకుంటూ బతికున్నవాళ్ళకి చావుబాజా వాయిస్తూన్న డాక్టరు!

చచ్చిపోయిన శవాల్ని రూపాయల రాశిగా పేరుస్తూన్న రాజయ్యా.

రమ్మని పిలుస్తూన్న కాంపౌండరూ– పొమ్మని తోసేస్తూన్న గుమాస్తా.

డాక్టరూ బాబిగాడూ– కాంపౌండరూ రాజయ్యా– తనూ గుమాస్తా– రజనీ చావుబాజా–

బాబిగాడూ రజనీ! డాక్టరూ రాజయ్యా! తనూ చావుబాజా! రూపాయలూ బాబిగాడూ– మేడా రూపాయలూ– ఏడుపులూ– కేకలూ– అరుపులూ– నవ్వులూ–రూపాలు శబ్దాలు–శబ్దాలు– రూపాలు– వందలు వేలు – వేలు లక్షలు – మహా వేగంగా కలగా పులగంగా – అటూ ఇటూ ఇటూ అటూ– ఏడుపులు నవ్వులు – ఏడుపులు నవ్వులు–

వెలుగూ చీకటీ ఎత్తూ పల్లం–ఆకాశం– నేలా – మట్టీ– మబ్బూ – గిర గిరా గిర గిరా–

కళ్ళు గట్టిగా మూసుకుని కెవ్వుమని అరిచాడు అసిరిగాడు.

అంతే!–

ఒక్కమారుగా అల్లకల్లోలం అంతా అణిగిపోయింది. మెదడులో ఆలోచన లేదు–శరీరంలో చైతన్యం లేదు–– కళ్ళల్లో జీవం లేదు–

జీవంపోయిన గాజుకళ్ళకి ఏం కనిపించడం లేదు.

పైన నింగి

కింద నేలా–

అసిరిగాడు గుండెలవిసేలాగ ఓ వెర్రి నవ్వు నవ్వాడు–"రజని చచ్చిపోయిందా? వెర్రివాళ్ళల్లారా లేదు అదిగో చూడండి.... నీలంచీర కట్టుకుని బాణంలా అందంగా వంగి అటూ ఇటూ నేనున్న నేలని ఎలా ముట్టుకుంటోందో! .... నవ్వుతూ రమ్మంటోంది....రారా బాబిగా పోదాం" అంటూ బాబిగాడినో బుజానీ్న, చావుబాజాని మరో బుజానీ్న వేసుకొని లేచాడు అసిరిగాడు.

ఊరుదాటి నింగీ నేలా కలిసేచోటువెళ్ళిపోతూన్న అసిరిగాడిని చూసి "వీడికి పిచ్చెక్కింది" అనుకొన్నారు కొందరు.

దూరాన్నుంచి (క్రమేపీ తగ్గిపోతూ సన్నగా వినిపిస్తూన్న వాడి బాజా విని, "పాపం ఎవరో పోయారు!" అనుకొన్నారు మరికొందరు.

అంతేకాని–

మతితప్పిన అసిరిగాడు (శ్రుతి తప్పిన బతుకులకే చావు బాజా వాయిస్తూ, అప్పిచ్చువాడూ, వైద్యుడూ లేని ఊరుకోసం వెతుక్కుంటూ పోతున్నాడని మాత్రం ఎవరూ అనుకోలేదు.

★